# విచిత్ర సదనం

ఆ భవనం అన్ని ఆధునిక సౌకర్యాలతో అతి సుందరంగా కట్టబడింది. ఆభవనం పూర్తికాగానే అమెరికా రాయబారి తీసుకున్నారు. ఆనాటి పాకిస్తాన్ రాష్ట్రపతి మహమ్మద్ అయూబ్‌ఖాన్ ఆ భవనానికి ప్రారంభోత్సవం చేశారు....

1925 వరకు అక్కడ ఒక పీర్ సమాధి వుండేది. దానికి పూజలు పునస్కారాలు జరిగేవి. ఒక ఫకీర్ చూసేవాడు. అక్కడ ఉర్సు కూడా జరిగేది. ఆఫకీర్ తాయత్తులు ఇచ్చేవాడు. 1910లో సొహరాబ్‌జీ అనే ఒక వజ్రాల వ్యాపారి కరాచీ వచ్చాడు. విక్టోరియా రోడ్డులో పెద్ద పెద్దవాళ్ళు వుంటారు. అతని దృష్టి ఆ సమాధి దగ్గరలో వున్న తొమ్మిది ఎకరాల ఖాళీ స్థలంమీద పడింది. అది కొని ఒక విశాలమైన భవనం కట్టాలనే కోర్కె అతనికి కలిగింది. ఆ విషయం విని ఫకీర్ (అతని పేరు సుల్తాన్‌ఖాన్) ఆ వ్యాపారిని కలిసి, ఆస్థలం ప్రభుత్వానిది కాదనీ అది పీర్‌కు సంబంధించినదనీ, అక్కడ ప్రతి సంవత్సరం ఉర్సు జరుగుతుందనీ, భక్తులు దూర ప్రాంతాల నుంచి వస్తారనీ చెప్పి, అతనిని ఆ స్థలం కొనడానికి ప్రయత్నించవద్దని కోరాడు. అ వ్యాపారి అతని మాట వినలేదు.

"ఆ స్థలం ప్రభుత్వానిది - ఎంత ఖరీదైనా అదే కొంటాను" అన్నాడు.

''ఆ స్థలానికి నువ్వు వెల చెల్లించలేవు. అలా చేసిన పక్షంలో నువ్వు చాలా నష్టపోవాల్సి వుంటుంది.'' అని ఫకీర్ బెదిరించాడు. ఆ వ్యాపారికి ఫకీర్ బెదిరింపు చెవికెక్కలేదు.

1925 సెప్టెంబర్‌లో సేఠ్ ఆ స్థలాన్ని కొన్నాడు. వెంటనే భవన నిర్మాణం ప్రారంభం అయింది. పునాదులు తియ్యడం ప్రారంభించారు. పునాదులు తవ్వుతున్నప్పుడు కొన్ని పాములు బయటికివచ్చి కూలివాళ్ళను కాటువేయగా ఆరుగురు చనిపోయారు. గోడలు లేచాయి. కాని ఒక గోడ కూలి పదకొండు మంది కూలీలు చనిపోయారు. అయినా భవనం కింద అంతస్థు పూర్తి అయింది. కాని రెండో అంతస్థు ప్రారంభించక ముందే ఒకవైపు రూఫ్ పగిలి అందులో నుంచి ఎముకలూ, పుర్రెలూ బయటపడ్డాయి. మళ్ళీ దాన్ని పూర్తి చేశారు. రెండో అంతస్థు కడుతున్న సమయంలో సేఠ్ పెద్దకొడుకు మెట్లమీద నుంచి జారి క్రింద పడి మరణించాడు. కొడుకు పడిపోయిన విషయం విని (కూలీల అరుపులు విని) సేఠ్ త్వరగా త్వరగా క్రిందికి దిగుతూ అతనూ మెట్లమీద జారి క్రిందికి దొర్లి మరణించాడు. ఈ వార్త విని సేఠ్ చిన్న కొడుకు హీరాలాల్ పోర్ బందర్ నుంచి కార్లోవస్తూ ఒక ట్రక్కుకు ఢీకొని చనిపోయాడు. సేఠ్ మూడో కొడుకు కరాచీ వచ్చాడు. అతను మతి చెలించిన వాడిలా కరాచీ రోడ్ల మీద తిరుగుతూ కన్పించేవాడు. ఒకరోజు అతను పిస్టల్‌తో కాల్చుకొని చనిపోయాడు. ఈ విధంగా ఆ సేఠ్ వంశం నాశనం అయింది. ఆ తర్వాత చాలా కాలం ఆ భవన నిర్మాణం ఆగిపోయింది. విసెంట్ రీర్డ్ కరాచీకి కమీషనర్‌గా పని చేసి రిటైర్ అయ్యాడు. అతని భార్య విలియన్. అతనికి పిల్లలు లేరు. ఆ భవనాన్ని అతను కొన్నాడు. భవనం పూర్తిచేసే కార్యక్రమాన్ని ప్రారంభించాడు. ఒక రోజు పని జరుగుతుండగా అతని నెత్తిమీద ఒక ఇటుక జారి పడింది. అతనిని ఆసుపత్రిలో చేర్పించారు. రెండో రోజు అతను

చనిపోయాడు. భర్తపోయిన పదమూడవ రోజు దుఃఖంతో విలియన్ ఇంటిపై కప్పునుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నది.

ఆదే సమయంలో సివిల్ సర్వీస్‌లోకి నలుగురు యువకులు బ్రిటన్ నుంచి వచ్చారు. హెల్‌సింగ్, ఎడ్మండ్ బార్కర్, విలియంస్మిత్, డబ్ల్యూ రాబర్ట్ అనే ఆ నలుగురూ కొత్తగా ఇండియాకు వచ్చారు. ఆధునిక భావాలు గల వాళ్ళు ఆ భవనం గురించి విని ఎగతాళిగా నవ్వారు. వాళ్ళు ఆ భవనం పూర్తిచేసి తమ భార్యలను ఇంగ్లాండు నుంచి పిలిపించుకొని కాపరాలు పెట్టాలని ఆలోచించారు. ఆ విషయం తెలుసుకున్న ఫకీర్ ఆ నలుగురు ఐ. సి. యస్. ఆఫీసర్లను కలుసుకుని వారి అభిప్రాయాన్ని మార్చుకోవలసిందిగా సలహా ఇచ్చాడు.

అందుకు విలియమ్ స్మిత్ నవ్వుతూ, "మీ పీర్ ఆ సమాధిలో పాపం చాలా కాలంగా నిద్రపోతున్నాడుగా? సమాధి త్రవ్వి అతన్ని నిద్ర లేపుతాంలే. నువ్వేం బెంగపడకు" అన్నాడు.

ఆ మాటలకు ఫకీర్ కళ్ళలో నుంచి నిప్పులు మెరిశాయి.

"సరే కానివ్వండి. ఆ ఫలితాన్ని కూడా అనుభవించండి" అంటూ వెళ్ళిపోయాడు.

ఒక వారం గడిచింది. రాబర్ట్ ఒకనాటి రాత్రి క్లబ్బునుంచి తిరిగి వస్తున్నాడు. బాగా తాగి వున్నాడు. మంచి మైకంలో నడుస్తున్నాడు. కొద్ది దూరం నడిచాడో లేదో పెద్దపులి లాంటి ఒక భయంకరమైన కుక్క అరుస్తూ అతని మీద దూకడానికి సిద్ధంగా వున్నది. అతను భయంతో దాన్ని అదిలిస్తూ వుండగా, మరో కుక్క రెండోవైపు నుంచి అరుస్తూ వచ్చింది. భయపడిన రాబర్ట్ అరుస్తూ వెనక్కు క్లబ్బు వైపుకు పరుగులు తీశాడు. క్లబ్బులోని వాళ్ళు రాబర్ట్ అరుపులు విన్నారు. బయటకు

వచ్చారు. కుక్కల అరుపులు వాళ్ళకు వినిపించాయి. కాని కుక్కలు కన్పించలేదు. రాబర్ట్‌ను పట్టుకోవడానికి కొందరు ముందుకు వచ్చేలోగా అతను కాలుజారి పక్కనే వున్న పెద్ద గోతిలో పడిపోయాడు. తలపగిలి అక్కడి కక్కడే మరణించాడు.

రాబర్ట్ చనిపోయిన రెండు వారాలకు స్మిత్ కూడా చనిపోయాడు. ఆరోజు కరాచీలో కుంభవర్షం కురుస్తోంది. కరెంటులేదు. స్మిత్‌కు అసలే చిరాగ్గా వున్నది. ఫ్యాన్ పెట్రొమాక్స్ లైటు వెలిగిస్తున్నాడు. అది సరిగ్గా వెలగడంలేదు. స్మిత్‌కు చిరాకు ఎక్కువైంది. ఫ్యాన్‌ను అక్కడ్నుంచి లేపి తను లైటు వెలిగించడానికి కూర్చున్నాడు. కాని అది వెలిగినట్టే వెలిగి ఆరిపోసాగింది. ఒక్కసారిగా బాంబు పడినట్టు శబ్దం అయింది. ఫ్యాన్ భయంతో బయటికి పరుగు తీశాడు. పెట్రొమాక్స్ లైటుకు సంబంధించిన కిరోసిన్ టాంకు బద్దలైంది. నాలుగు వైపులా మంటలు వ్యాపించాయి. ఫైర్ ఇంజన్లు వచ్చాయి. నిప్పు ఆర్పి లోపలకు వెళ్ళిన వారికి స్మిత్ కాలిపోయిన శవం కన్పించింది.

ఆదే నెలలో హెల్‌సింగ్ కూడా విమాన ప్రమాదంలో మరణించాడు. ఎడ్‌మండ్ బార్కర్ మాత్రం జీవించి వున్నాడు. అతనికి ఫకీర్ మాటలు గుర్తువచ్చాయి. నిలువెల్లా వణికిపోయాడు. తన మిత్రులు ముగ్గురూ చనిపోయారు. ఒకడు గోతిలో పడ్డాడు. ఒకడు నిప్పువల్ల, మరొకడు గాలిలో చనిపోయాడు. ఇక మిగిలింది నీరు. అతన్ని పీడించసాగింది. నీరంటే భయం ఏర్పడింది. స్నానం మానేశాడు. మంచినీటికి బదులుగా సోడా తాగసాగాడు. అయినా అతను మృత్యువును తప్పించుకోలేకపోయాడు. ఒకరోజు సోడాబుడ్డి కొడుతుండగా అది బద్దలైంది. గాజు పెంకులు అతని పీకను కోశాయి. గోలీ వెళ్ళి నుదురు బద్దలు కొట్టింది. అతను కిక్కురుమనకుండా కన్ను మూశాడు. (పై నాలుగు చావులూ

కాకతాళీయంగా జరిగినవే కావచ్చును. ఇలాంటి చావులు సర్వసాధారణమైనవే. ఆ భవనానికి ఈ చావులను జోడించడం ఎంతవరకు అతుకుతుందో పాఠకులే ఆలోచించాలి.) 1935లో మునిసిపాలిటీ వాళ్ళు ఆ భవనాన్ని పడగొట్టి ఆ స్థలాన్ని చదునుచేశారు. ఆ సమయంలో ముస్తఫా అలీ మేయర్‌గా వుండేవాడు. అతనే ఈ పని చేయించాడు. భవనంతో పాటు పీర్ సమాధిని కూడా పగలగొట్టారు. ఆ పని జరిగిన రెండో రోజు ఉదయం సయ్యద్ ముస్తఫా అలీ నిద్రలేవలేదు. నిద్రలోనే ప్రాణాలు పోయాయని డాక్టర్ సర్టిఫై చేశాడు.

ఆ తర్వాత దాదాపు పాతికేళ్లపాటు ఆ భూమి అలాగే వుండిపోయింది.

1960లో ఎడ్వర్ట్ హ్యూబర్డ పాకిస్తాన్ రాయబారిగా వచ్చాడు. అతనికి భక్తి ఎక్కువ. ఈ కథలన్నీ విని, "ఆస్థలం నేను తీసుకుంటాను. పీర్ సమాధిని కూడా బాగు చేయిస్తాను" అని అన్నాడు.

అమెరికా నుంచి ఇంజనీరు వచ్చాడు. భవన నిర్మాణానికి ప్లాను వేశాడు. ఆ ప్లాను వేస్తున్నప్పుడు పీర్ సమాధికి ఎలాంటి హానీ కలగకుండా జాగ్రత్త పడ్డాడు. పైగా సగం పగిలిపోయిన ఆ సమాధిని బాగు చేయించాలనే నిర్ణయం కూడా జరిగింది.

అప్పుడు అయూబ్‌ఖాన్ పాకిస్తాన్ రాష్ట్రపతిగా వున్నాడు. ఢిల్లీ నుంచి మరికొన్ని ప్రాంతాల నుంచి మౌల్వీలను రప్పించి సమాధి దగ్గర ప్రార్థనలు చేయించారు. ప్రార్థనలలో స్వయంగా అయూబ్‌ఖాన్ కూడా పాల్గొన్నారు.

భవన నిర్మాణం ప్రారంభం అయింది. పునాదులు త్రవ్వుతుండగా ఇద్దరు కూలీలు చనిపోయారు. పై కప్పు పడి ఏడుగురు కూలీలు చని

పోయారు. కరెంటు ఫిక్సు చేస్తుండగా ఐదుగురు చనిపోయారు. దీనికి కారణం పీర్ కోపమేనని ఇంజనీర్‌తో పనివాళ్ళు అన్నారు. ఇంజనీర్ తేలికగా తీసుకుని "పెద్ద పెద్ద భవంతులు నిర్మిస్తున్నప్పుడు ఇలాంటి చావులు సర్వ సాధారణమే" అన్నాడు.

70 లక్షల వ్యయంతో భవనం పూర్తి అయింది. అమెరికా రాయబారి కార్యాలయం కొరకు ఆ భవన నిర్మాణం జరిగింది. అమెరికా ఉపరాష్ట్రపతి లిండన్ బెన్ జాన్సన్ ప్రారంభోత్సవం సందర్భంగా కరాచీ వచ్చాడు. తెల్లవారి ప్రారంభోత్సవం అనగా కొందరు అమెరికన్ స్త్రీలు లాన్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. కొంచెం దూరంలో ఒక వ్యక్తి కన్పించాడు. పైనుంచి కింద వరకూ అంగరఖా ధరించి వున్నాడు. తలమీద టోపి, మెడలో నల్లటి పూసల దండ వేలాడుతున్నది. అతనిముఖం క్రూరంగావున్నది. ఒకామెలేచి "ఎవరు నువ్వు?" అంటు ప్రశ్నించింది. రెండడుగులు ముందుకువేసి పలక్కుండా మెట్లు ఎక్కపోగాడు. ఆ స్త్రీలు అతను తమవైపుకే వస్తున్నాడనుకున్నారు. మరుక్షణంలో అతను కన్పించలేదు. ఆ స్త్రీలు చెప్పిన విషయం విని భద్రతా చర్యల ఏర్పాట్లలో ఎక్కువ శ్రద్ధ తీసుకున్నారు.

అమెరికన్ ఉపరాష్ట్రపతి ఆ సాయంత్రం భవన ప్రారంభోత్సవం చేశాడు. మధ్యాహ్నం భోజనాల తర్వాత అతని ప్రయివేట్ సెక్రటరీ శామ్యూల్ కన్పించలేదు. అతను ఎక్కడికెళ్లింది ఎవరూ చెప్పలేక పోయారు.

ప్రారంభోత్సం తర్వాత అందరూ బిల్డింగ్ తిరిగి చూస్తున్నారు. అయూబ్‌ఖాన్ కూడా వున్నాడు. లైబ్రరీ గదికి తాళం వేసి వున్నది. మిగతా గదులన్నీ తెరిచేవున్నాయి. ఆ గది ముందునుంచి వెళ్ళుతుండగా లోపలనుంచి ఎవరో మూలుగుతున్నట్టు విన్పించింది. ఉప రాష్ట్రపతి

ఆ కంఠం తన సెక్రటరీదని గుర్తించాడు. ఏ తాళం చెవితోనూ తాళం విడలేదు. చివరకు తలుపులు బద్దలు కొట్టారు.

లైబ్రరీ గదిలో శామ్యూల్ ఒక గోడకు బల్లిలా అతుక్కుని వున్నాడు.

"సర్! సర్! ఒక ఫకీర్ అంటూనే 'ధన్' మని కిందపడిపోయాడు.

అతను తర్వాత తేరుకుని చెప్పిన కథ :

శామ్యూల్ ముందుగా అరేంజ్‌మెంట్సు చూడటానికి లంచ్ తర్వాత ఆ భవనానికి వచ్చాడు. లైబ్రరీ గదిలో ప్రవేశించాడు. ఎవరో బీరువాను తట్టిన శబ్దం ముందు వినిపించింది. అంతలో ఎవరో బీరువాను సర్రున జరిపిన శబ్దం. "ఎవరది-'' శామ్యూల్ అరిచాడు.

ఒక బీరువా వెనుకనుండి ఒక ఫకీర్ ముందుకు వచ్చాడు

''ఎవరు నువ్వు?'' అంటూ మళ్లీ అరిచాడు శామ్యూల్. దానికి సమాధానంగా ఫకీర్ శామ్యూల్‌ని తీవ్రంగా చూస్తూ బయటికి వెళ్ళమని వేలితో సైగచేశాడు.

"ఎవరి పర్మిషన్‌తో ఇక్కడికి వచ్చావ్? నువ్వే ముందు బయటికి వెళ్ళు." శామ్యూల్ గద్దించాడు.

వెంటనే ఫకీర్ శామ్యూల్‌ను ఒక్కతోపు తోశాడు. అతను కింద పడి గబుక్కున లేచి నిల్చున్నాడు. అప్పటికే అ గదిదక్షిణపు గోడ వగిలింది. అందులో నుంచి ఫకీర్ వెళ్ళిపోయాడు. శామ్యూల్ భయంతో బయటికి వరుగెత్తబోయాడు. కాని తలుపులు బయట నుంచి వేసివున్నాయి.

అతను చెప్పిన కథ అందర్నీ చకితుల్ని చేసింది. ఆ గది దక్షిణపు గోడ యధాతథంగానే వున్నది.

అమెరికన్ ఉపరాష్ట్రపతికి పీర్ సమాధి గురించీ, అంతకు ముందు జరిగిన సంఘటనల గురించీ అయూబ్‌ఖాన్ వివరించాడు. జాన్సన్ "పీర్''ను శాంతింప చేసే ఉపాయం ఏదైనా ఉన్నదా?" అని అడిగాడు. అందుకు ఎవరూ సమాధానం ఇవ్వలేకపోయారు.

కాని కొన్ని వెలలకే అమెరికన్ రాయబారి కార్యాలయం కరాచీ నుంచి ఇస్లామాబాద్‌కు మార్చబడింది. కారణం ఇస్లామాబాద్‌ను పాకిస్తాన్ రాజధానిగా మార్చడమే.

ఆనాటి నుంచి ఈనాటి వరకు 70 లక్షలతో కట్టిన ఆ సుందర భవనం పాడుబడివున్నది. అందులో ప్రవేశించే ధైర్యం ఎవరికీ లేదు.

ఎవరైనా హేతువాదులు ధైర్యం చేస్తే ప్రజల్లోని కొన్ని మూఢ నమ్మకాలను తొలగించవచ్చు.